


కొత్త రేషన్‌కార్డులపై ఆశలు



మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 18 : పేదల నిరీక్షణ ఫలించనుంది. కొత్త రేషన్‌కార్డులపై ప్రభుత్వం దృష్టి సారించింది. పార్లమెంట్ ఎన్నికలకోడ్ ముగియడంతో రేషన్‌కార్డులను అందచేసేందుకు కాంగ్రెస్ సర్కార్ కసరత్తు చేస్తోంది. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొన్ని రేషన్‌కార్డులను పంపిణీ చేసి, ఆ తర్వాత నిలిపివేసింది. మార్పులు, చేర్పులు, సవరణల కోసం పెట్టుకున్న దరఖాస్తులకు మోక్షం లేకుండాపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజాపాలన నిర్వహించి, అందులో రేషన్‌కార్డుల కోసం కూడా దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాపాలన ద్వారా మహబూబాబాద్ జిల్లాలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయో! వివరాలు జిల్లా పౌరసరఫరాల శాఖ వద్ద సమాచారం లేదు. ప్రతీ సంక్షేమ పథకానికి రేషన్‌కార్డే ప్రమాణికంగా ప్రభుత్వం తీసుకుంటుండడంతో రేషన్‌కార్డు ప్రజలకు ఎంతో అత్యవసరంగా మారింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నూతన ప్రభుత్వంలో కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేస్తామని ప్రకటించడం ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. కాగా, ప్రభుత్వం సన్నబియ్యాన్ని సంక్రాంతి నుంచి సరఫరా చేస్తామని చెబుతున్నారు.

జిల్లాలో రేషన్‌కార్డులు ఇలా..

మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల్లో ఆహార భద్రత కార్డులు (ఎఎస్‌సీ) 2,24,815, అంత్యోదయ కార్డులు (ఏఎఫ్ఎస్‌సీ) 15,553, అన్నపూర్ణ కార్డులు (ఏఏపీ) 02 వెరసి 240370 కార్డులు ఉన్నాయి. ఈ కార్డుదారులకు జిల్లాలోని రేషన్ డీలర్ల ద్వారా ఒక్కరికి ఆరుకిలోల చొప్పున 3,932 మెట్రిక్ టన్నుల బియ్యం ఉచితంగా అందజేస్తున్నారు. అయితే అంత్యోదయ కార్డుదారులకు అరకిలో చొప్పున చెక్కర అందించాల్సి ఉండగా గ్రామాల్లో ఎటు సరిపోని చెక్కర అందజేస్తే ప్రజల నుంచి వివాదాలు వస్తున్నాయి అని చెబుతూ.. డీలర్లు చెక్కరను తీసుకువెళ్లకుండా గ్రామాల్లో పంపిణీ చేయడం లేదు. దాంతో చెక్కర సరఫరా బంద్ అయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సమయంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలకు తెల్లరేషన్‌కార్డులు, ధనికులకు పింక్ రేషన్‌కార్డులు ఇచ్చేవారు. పింక్ కార్డుదారులకు చక్కర పంపిణీ జరిగేది. రాష్ట్రం రెండుగా విడిపోయి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆహారభద్రత కార్డులుగా మార్చివేశారు. బియ్యం మాత్రమే ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

మార్పులు, చేర్పుల కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తు వివరాలు

మండలం	దరఖాస్తులు
బయ్యారం	1560
చిన్నగూడూరు	757
దంతాలపల్లి	1520
డోర్నకల్	2401
గంగారం	374
గార్ల	1554
గూడూరు	1946
కేసముద్రం	2944
కొత్తగూడ	1087
కురవి	2492
మహ-బాద్	4055
మరిపెడ	2284
నర్సింహులపేట	1463
నెల్లికుదురు	1799
పెద్దవంగర	1059
తొర్రూరు	2622
మొత్తం :	29917

- దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం
- పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియడంతో కసరత్తు
- దరఖాస్తు దారుల్లో ఆనందం
- సవరణల కోసం 29,917మంది అర్జీలు

మార్పులు, చేర్పుల దరఖాస్తులు 29,917 పెండింగ్..

జిల్లాలో రేషన్‌కార్డుల్లో పేర్ల మార్పులు, చేర్పులు కుటుంబసభ్యుల సవరణల కోసం 29, 917 మంది దరఖాస్తులు వచ్చాయి. వాటిని గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ఈ సవరణలను ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు చేయాల్సి ఉండగా, ఆనాటి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాల రాకపోవడంతో ఆ దరఖాస్తులను పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టించుకోలేదు. దాంతో అలాగే పెండింగ్‌లో ఉండిపోయాయి. అయితే కొత్త రేషన్‌కార్డు కోసం ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో లేవని జిల్లా పౌర సరఫరాల శాఖ చెబుతోంది. అయితే గత ప్రభుత్వంలోనే 2021లో 11 వేల కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేసిందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. వారికి అందరితో పాటు బియ్యం సరఫరా కూడా అందిస్తున్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల వివరాలు ఎక్కడ?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డులు కావాలని అనేక మంది ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా ఎంత మంది ప్రజలు కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలు జిల్లా పౌరసరఫరాల శాఖ వద్ద అందుబాటులో లేవు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కార్యాలయం నుంచి జిల్లాకు వివరాలను పంపలేదని జిల్లా అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో 'ఆన్‌లైన్' వెబ్‌సైట్‌లో రాష్ట్ర కార్యాలయం నుంచి వెబ్‌సైట్ డేటా లాగిన్ కాకపోవడం గమనార్హం. దాంతో వివరాలు అందుబాటులోకి రాలేదని తెలుస్తుంది. లాగిన్ అయితేనే ప్రజాపాలనలో ఎన్ని దరఖాస్తులు చేసుకున్నారన్నది పూర్తి వివరాలు తెలుస్తాయని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

కార్యాలయం చుట్టూ తిరిగినా పేర్లు చేర్చలే..

పెండ్ర నాగరాజు, దివ్యాంగుడు, డోర్నకల్



నా పేరుపై రేషన్‌కార్డు వచ్చింది. కానీ, అందులో నా భార్య ఇద్దరు పిల్లల పేర్లు చేర్చలేదు. కార్డు సవరణ చేసి కార్డులో వారిపేర్లు యాడ్ చేయాలని కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు. నేను దివ్యాంగుడను కార్యాలయాల వెంబడి తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నా. రేషన్‌కార్డులో నా ఒక్కడి పేరు మాత్రమే ఉంది. నా భార్య పిల్లల పేర్లు కూడా యాడ్‌చేసి, కొత్త రేషన్‌కార్డు మంజూరు చేయాలి.

కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

గౌని మల్లేశం, మద్దివంచ, గార్ల మండలం



కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా దరఖాస్తు చేసుకున్న ప్రజలకు కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలి. అలాగే మార్పులు, చేర్పులు, సవరణలు చేసుకున్న వారికి కూడా కార్డులు మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

విధివిధానాలు అందలేదు : రాజేందర్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి



కొత్త రేషన్‌కార్డు కోసం పెట్టుకున్న దరఖాస్తులు ఒక్కటి కూడా పెండింగ్‌లో లేవు. 29,917 మంది మాత్రం మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అవి పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తుల వివరాలు కమిషనరేట్ నుంచి ఇప్పటి వరకు అందలేదు. దాంతో వివరాలు తెలియరాలేదు. ఇప్పటి వరకు జిల్లాలో 2,40,370 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఆ కార్డులన్నింటికి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.



ఐటీడీఏ సమావేశంలో మాట్లాడుతున్న సీతక్క

అధికారులు అంకితభావంతో పనిచేయాలి

- వర్షాకాలం దృష్ట్యా అప్రమత్తంగా వ్యవహరించాలి
- మాదక ద్రవ్యాల నిర్మూలనపై పోలీసులు దృష్టిపెట్టాలి
- ఒక ప్రతి మూడు నెలలకోసారి ఐటీడీఏ పాలకమండలి సమావేశాలు
- పంచాయతీరాజ్, స్త్రీశిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క

ఏటూరునాగారం రూరల్, జూన్ 18 : ఐటీడీఏ అధికారులు అంకితభావంతో పనిచేయాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖమంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో జిల్లా అధికారులు, ఐటీడీఏ సెక్టోరియల్ అధికారులతో మంత్రి మంగళవారం సమావేశమయ్యారు. మొదటగా ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నీటిపారు దల, రెవెన్యూ, పోలీసు, అటవీశాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. వానాకాలంలో చేపట్టాల్సిన కార్యాచరణ, అభివృద్ధి పనులు, సాగునీరు, వరదలు తదితర ప్రణాళికలపై సమీక్షించారు. ఏజెన్సీలో పనిచేయడాన్ని అధికారులు అదృష్టంగా భావించాలన్నారు. పనిచేసే అధికారులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రజల్లో ఉంటూ సేవ చేయాలని గానీ.. పైరవీలకు తావివ్వొద్దన్నారు. ఏజెన్సీలో పనిచేస్తేనే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని, విధుల పట్ల శ్రద్ధలేని వారు వేరే ప్రాంతాలకు స్వచ్ఛందంగా వెళ్లొచ్చని అన్నారు. అలాగే జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు విశేషంగా కృషి చేయాలన్నారు. నేరాలకు కారకమైన డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి రవాణాపై నిఘాతోపాటు వాటి వల్ల కలిగే అవరోధాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నేర ప్రవృత్తి ఉన్నవారిపై ప్రత్యేక నిఘా పెట్టి వారి కదలికలను ఎప్పటికప్పుడు పసిగట్టాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా వైద్యాధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. గ్రామాల్లో నిత్యం పర్యటిస్తూ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లను అలర్ట్ చేయాలన్నారు.

అటవీ శాఖ అధికారులు సంయమనం పాటించాలని మంత్రి సీతక్క అన్నారు. పట్టాలిచ్చిన భూముల మధ్య వివాదాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఉద్యాన సాగును ప్రోత్సహించాలన్నారు. గిరిజన భూముల్లో పండ్లతోటలు, కూరగాయాల సాగును చేపట్టేలా ఐటీడీఏ అధికారులు చొరవ చూపాలన్నారు. త్వరలోనే ఐటీడీఏ పాలక మండలి సమావేశాలను నిర్వహిస్తామని, ప్రతి మూడు నెలలకోసారి దీన్ని కొనసాగిస్తామని అన్నారు. అలాగే జిల్లా యంత్రాంగం నెలలో రెండుసార్లు అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించాలని కలెక్టర్, పీవోలకు మంత్రి సూచించారు. ఏజెన్సీ ప్రజల సమస్యలను తీర్చే వారధిగా ఐటీడీఏ ఉందన్నారు. ఐటీడీఏకు పేరు తీసుకొచ్చేలా అధికారుల పనితీరు ఉండాలని మంత్రి తెలిపారు. ఏజెన్సీలో జరిగే పనుల్లో నాణ్యత లోపాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిని ఉపేక్షించొద్దని అధికారులకు సూచించారు. ప్రజల అవసరాలకు అనుకూలంగా పనులుండాలన్నారు. పార్టీలు, కాంట్రాక్టర్లకు అనుకూలంగా ఉండొద్దని అన్నారు. ఏజెన్సీలో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై కలెక్టర్, పీవో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

ఈ సమావేశంలో కలెక్టర్ టి.ఎస్.దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌యాదవ్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఏఎస్పీ మహేష్ గితే, ఏపీవో వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

సీఈవో పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

కేసముద్రం, జూన్ 18 : 'స్వామినాథన్ కేసముద్రం' మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌కు తాత్కాలిక పద్ధతిలో ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)గా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ కంపెనీ చైర్మన్ మెట్టు ఉమ, ఏపీఎం రాజీర్ మంగళవారం తెలిపారు. బీఎస్సీ అగ్రికల్చర్, అగ్రికల్చర్ బిజినెస్ మేనేజ్‌మెంట్, డిప్లొమా తత్సమాన అర్హతలు కలిగి 35 ఏళ్లలోపు వయస్సున్న అభ్యర్థులు ఈనెల 22 సాయంత్రం 5 గంటల లోపు ఐకేపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అంబర్, గుట్కాల స్వాధీనం

- రూ.2.50లక్షల విలువైన ప్యాకెట్లను పట్టుకున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న అంబర్, గుట్కా ప్యాకెట్లతో పోలీసులు

తొర్రూరు, జూన్ 18 : ప్రభుత్వ నిషేధిత అంబర్, గుట్కాలను విక్రయిస్తుండగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. మంగళవారం తొర్రూరులోని పాన్‌షాప్‌లు, కిరాణాషాప్‌లు, మార్కెటింగ్ ఏజెన్సీల నిర్వాహకుల వద్ద పోలీసు సిబ్బందితో విస్తృత తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని గోపారపు నిరంజన్ అను వ్యాపారి ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన అంబర్, పాన్‌బార్, ఆర్ఆర్ నిషేధిత గుట్కాలు బస్తాల్లో నిల్వచేసి ఉండగా తనిఖీ చేసి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని ఇతర దుకాణాల్లో మరో రూ.50 వేల విలువ గల గుట్కాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై రాంజీనాయక్, ఏఎస్సై కృష్ణ, సాయికృష్ణ, సాయికిరణ్, పరమేష్, మల్లేష్, తదితరులు ఉన్నారు.

ఉమ్మడిజిల్లాలో కొత్తగా 12 కో ఆపరేటివ్ బ్యాంకులు

- ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాం
- రుణమాఫీతో లక్షలాది మంది రైతులకు ప్రయోజనం
- హామీనిచ్చి నెరవేర్చడం సీఎం రేవంత్‌కే సాధ్యం
- డీసీసీ బ్యాంక్ మేనేజింగ్ కమిటీ సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని



మేనేజింగ్ కమిటీ సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్ 18 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా 12కో ఆపరేటివ్ బ్యాంకుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, రాష్ట్రంలో ప్రతీ రైతుకు డీసీసీబీల ద్వారా ప్రయోజనం పొందేలా ప్రభుత్వ సహకారంతో ముందుకు వెళతానని రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు (టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్ రావు పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన డీసీసీ బ్యాంక్ మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కోపరేటివ్ బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీకి టెస్కాబ్ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. టెస్కాబ్ పరిధిలో 33లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారని, అయితే వీరిలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న సుమారు 7.75లక్షల మందికి రూ.4,786కోట్ల మాఫీ ద్వారా ప్రయోజనం కలగనుందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రైతులకు లక్ష రుపాయల రుణమాఫీ చేయలేకపోయిందని విమర్శించారు. హామీ ఇచ్చి నెరవేర్చడం.. రైతు పక్షపాతిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డికే సాధ్యమవుతుందన్నారు. ఎంతో నమ్మకంతో తనను టెస్కాబ్ చైర్మన్‌గానియమించిన రేవంత్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతులకు సేవ చేస్తానని రవీందర్‌రావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు లావాదేవీలు, రుణాల మంజూరు, రికవరీ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూన్ 18 : ప్రభుత్వ భూముల్లో నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణ శివారు సీపీఐ భూ పోరాటకాలనీలో మంగళవారం నిర్వహించిన ఈ సమావేశంలో అయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి, మోసం చేసిందని అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించారని చెప్పారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదలందరికి ఇంటి పట్టాలిచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, అశోక్, చిరంజీవి, మల్లయ్య, మల్లికార్జున్, సత్యం, బాలాజీ, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



కొనేదెట్టా తినేదెట్టా?

- రోజురోజుకు పెరుగుతున్న కూరగాయల ధరలు
- వారం రోజుల్లోనే రెట్టింపు
- వర్షాల్లేక, కోతుల బెడదతో దెబ్బతిన్న పంటలు
- ఏపీ, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతితో మరింత భారం
- కొనలేక సామాన్యులు, పేదలు విలవిల

వివరాలు 7లో..

గ్రామాల్లో భౌ భయం

- ఊళ్లల్లో కుక్కల స్వైరవిహారం
- రెండునెలల్లోనే 217 మంది బాధితులు
- వణుకుతున్న ప్రజలు



వెల్లికట్టె శివారులో సంచరిస్తున్న కుక్కలు


తొర్రూరు రూరల్, జూన్ 18 : మండలంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామాల్లో, వీధుల్లో విచ్చలవిడిగా అవి సంచరిస్తోండటంతో దారివెంట వెళ్లే ప్రజలు వణుకుతున్నారు. రోడ్డు వెంబడిపోతున్న వారిపై ఒక్కసారిగా దాడిచేసి, తీవ్రంగా గాయపరుస్తున్నాయి. దీంతో ప్రాణభయంతో ప్రజలు బయటకురావాలంటే జంకుతున్నారు. తొర్రూరు మండలంలోని పత్తేపురం, మడిపల్లి, మాటేడు, వెల్లికట్టె, అమ్మాపురం గ్రామాల్లో కుక్కలు గుంపులుగుంపులుగాసంచరిస్తూ.. వృద్ధులు, యువకులు, చిన్నారులపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. అంతేకాకుండా వీధుల గుండా ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై వెళ్లే ప్రయాణీకులను వెంబడించి దాడి చేయడంతో గాయపడుతున్నారు. కుక్కల సంతానోత్పత్తిని తగ్గించడానికి డివిజన్ కేంద్రంలో ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్) ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని కుక్కలను పట్టుకువచ్చి వాటికి కు.ని (కుటుంబ నియంత్రణ) ఆపరేషన్లు చేసి, దూరంగా అడవి ప్రాంతాల్లో వదిలేస్తుంటారు. అయితే మునిసిపల్ పరిధిలోనే నామమాత్రంగా కుక్కలను పట్టుకొని ఆపరేషన్లు చేస్తున్నారే తప్ప, గ్రామాల్లోని వాటిపై దృష్టి పెట్టడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైగా ఆపరేషన్లు చేసిన కుక్కలను

మిగతా 8వ పేజీలో..

రెండు నెలల్లో..

తొర్రూరు మండలంలోని 29 గ్రామాల్లో కుక్కల దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గత మే నెలలో 143, జూన్ 18 వరకు 74 వరకు కుక్కకాటు బారినపడినట్లు వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు. మే నెలలో కుక్కకాటు బాధితులు 143, పిల్లి 5, కోతి 32 మంది నమోదు కాగా, జూన్ 18వ తేది వరకు 99 మంది వివిధ జంతువులతో గాయపడితే కేవలం కుక్కకాటుతో 74 మంది కుక్కకాటు బారిన పడ్డారు. కుక్కల సంతానోత్పత్తిని తగ్గించడానికి ఏబీసీ సెంటర్ ఏర్పాటు చేసి ఆపరేషన్లు చేస్తున్నామని రికార్డుల్లో చూపిస్తున్నారు తప్పా గ్రామాల్లో తిరిగి పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో గతంలో లేనివిధంగా రోజురోజుకు కుక్కల సంఖ్య భారీగా పెరిగిపోతోంది. అందులో భాగంగానే తొర్రూరు మండలం మడిపల్లిలో ఇంటి ఆవరణలో పడుకున్న 42 రోజుల మగ శిశువుపై పిచ్చి కుక్క దాడి చేయడంతో మృతి చెందాడు. ఇలాంటి పునరావృతం కాకుండా అధికారుల కుక్కలకు టీకాలు వేయడంతో పాటు, పట్టుబడిన కుక్కలను గ్రామాలకు సమీపంలో కాకుండా అడవి ప్రాంతాల్లో వదిలిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.







కేసు పెట్టారన్న భయంతో గొత్తికోయ వ్యక్తి ఆత్మహత్య

ములుగు జిల్లా కన్నాయిగూడెంలో ఘటన


ఆత్మహత్య చేసుకున్న పద్దెం లక్ష్మయ్య

ఏటూరునాగారం రూరల్, 18: పోడు నరికిన కారణంగా పోలీసులు కేసు పెట్టారన్న భయంతో ఓ గొత్తికోయవాసి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో మంగళవారం జరిగింది. కన్నాయిగూడెం ఎస్‌ఐ సురేష్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం సమీపంలోని మల్కపల్లి గొత్తికోయగూడానికి చెందిన మడకం బోగయ్య, మడకం బండయ్య, మడవి చుక్కయ్య, పద్దెం లక్ష్మయ్య సమీప అడవుల్లో పోడు నరికేందుకు గాను బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన సునారికాని లక్ష్మయ్య, జనగం సమ్మయ్య వద్ద కొంత డబ్బు తీసుకొని ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందంలో భాగంగా బోగయ్య, బండయ్య, చుక్కయ్య, లక్ష్మయ్య కొంతమేర పోడు కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖాధికారులు పోడు నరికివేతను అడ్డుకున్నారు. ఆ తర్వాత అటవీశాఖ అధికారులు ఆ నలుగురిపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అటవీశాఖాధికారులు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారన్న విషయం వారికి తెలవగా.. పద్దెం లక్ష్మయ్య(40) భయంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108లో సామాజిక ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడు లక్ష్మయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

కేయూ క్యాంపస్, జూన్ 18 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర డిగ్రీ కోర్సుల పరీక్షలు జరుగుతున్నాయి. జనగామ ఏబీవీ డిగ్రీ కళాశాలలో ఇద్దరు వ్యక్తులు ఒకరికిబదులుగా మరొకరు పరీక్షలు రాస్తుండగా తనిఖీ అధికారులు డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్‌లు మంగళవారం తెలిపారు. వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
















కొనేదెట్టా? తినేదెట్టా?

రోజురోజుకు పెరుగుతున్న కూరగాయల ధరలు

- వారం రోజుల్లోనే రెట్టింపు
- వర్షాల్లేక, కోతుల బెడదతో దెబ్బతిన్న పంటలు
- ఏపీ, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతితో మరింత భారం
- కొనలేక సామాన్యులు, పేదలు విలవిల

మహబూబాబాద్ టౌన్/తొర్రూరు/మరిపెడ జూన్ 18 : కూరగాయల రేట్లు మండిపోతున్నాయి. ఇప్పటికే బియ్యం, ఇతర నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరుగుతుండగా.. కూరగాయల ధరలు కూడా రోజురోజుకు పెరుగుతుండటంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. ధరలిలా ఉంటే కొనేదెట్టా? తినేదెట్టా? అంటూ బెంబేలెత్తిపోతున్నారు. వారం రోజులుగా మార్కెట్లలో కూరగాయల ధరలు రెట్టింపవడంతో మార్కెట్‌కు రూ.500 నోటు తీసుకువెళితే.. కనీసం వారం రోజులకు సరిపడా కూరగాయలు రాని పరిస్థితి ఉంది. ముఖ్యంగా సామాన్యులకు నిత్యం అందుబాటులో ఉండే టమాట కిలో రూ.70 పలుకుతోంది. నిన్నమొన్నటి వరకు రూ.30కి లభించిన టమాట ఇప్పుడు డబుల్ కావడంతో వినియోగదారులకు పట్టపగలే చుక్కలు కన్పిస్తున్నాయి. మృగశిరకార్తెలో ప్రవేశించి, వర్షాకాలం ప్రారంభమైనా సకాలంలో వర్షాలు కురవక పోవడం, ఎండ తీవ్రత తగ్గకపోవడం లాంటి కారణాలతో కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. మరో వైపు గ్రామాల్లో కోతుల బెడదతో కూరగాయల పంటలు సాగు చేసే వారి సంఖ్య తగ్గడం, ఒక వేళ సాగు చేసినా దిగుబడి తగ్గిపోతుండం కూడా కారనాలు కనిపిస్తున్నాయి. ఎప్పుడూ స్థానికంగా దొరికే కొత్తిమీర ధర గతంలో కట్టకు రూ.50 ఉంటే ప్రస్తుతం రూ.200 నుంచి రూ.300 పలుకుతోంది. ప్రస్తుతం కొత్తిమీరను మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఇక ఆకుకూరలదీ అదే పరిస్థితి. గతంలో బచ్చలికూర, పాలకూర, గోంగూర రూ.10కి 5కట్టలు ఇస్తే ప్రసుతం ఒక్క కట్టను రూ.5కు విక్రయిస్తున్నారు. ప్రతీ రోజూ కూరగాయలకే రూ.100ఖర్చు చేయాల్సి వస్తే తమ పరిస్థితేంటని దినసరి కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





మహబూబాబాద్ మార్కెట్లో కూరగాయలను విక్రయిస్తున్న మహిళ

దూర ప్రాంతాల నుంచి దిగుమతి..

ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా గిరిజన రైతులు కూరగాయలు, ఆకుకూరల సాగు చేస్తుంటారు. ఈసారి కూడా గతం కంటే అత్యధిక రైతులు కూరగాయల పంట సాగుకు మొగ్గు చూపినా వాతావరణం అనుకూలించకపోవడంతో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో వినియోగదారుల డిమాండ్ల కనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో కూరగాయల మార్కెట్ వ్యాపారులు ఏపీలోని గుంటూరు, తిరుపతి, మదనపల్లి, తెలంగాణలోని బోయినపల్లి, ఒంటిమామిడి తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో రవాణాచార్జీలు ఇతరత్రా ఖర్చులతో కలిపి కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి.



వారం రోజుల్లో కూరగాయల ధరలు పెరిగాయిలా (కిలోకు)

రకం	నిన్నమొన్నటి వరకు	ప్రస్తుతం
టమాట	రూ.30	రూ.70
బీరకాయ	రూ.50	రూ.160
కాకరకాయ	రూ.50	రూ.100
దోసకాయ	రూ.20	రూ.50
దొండకాయ	రూ.20	రూ.60
గోరు చిక్కుడు	రూ.30	రూ.60
మిర్చి	రూ.50	రూ.100
మంచి చిక్కుడు	రూ.60	రూ.100
క్యారెట్	రూ.60	రూ.120
క్యాబేజీ	రూ.30	రూ.50
కొత్తిమీర	రూ.50	రూ.200
పుదీన	రూ.50	రూ.100

ధరలు పెరిగి కొనుగోళ్లు తగ్గాయి

మేదరమెట్ల వెంకట్రావు, కూరగాయల వ్యాపారి, మానుకోట



కూరగాయల ధరలు పెరగడంతో కొనుగోళ్లు తగ్గాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడం, గ్రామాలు, తండాల్లో కోతుల బెడదతో కూరగాయల పంటలు చేతికి రావడం లేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. రవాణా చార్జీలు, ఇతరత్రా ఖర్చులతో కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. ధరలు పెరిగి కొనుగోళ్లు తగ్గడంతో పెట్టిన పెట్టుబడులు వెళ్లడం లేదు.

దళారులకే లాభం..

రావిశెట్టి శోభ, కూరగాయల వ్యాపారి, మరిపెడ బంగ్లా



కూరగాయల విక్రయంలో దళారులకే లాభం జరుగుతోంది. పొద్దస్తమానం ఎండకిఎండి, వానకితడిచి రిటైల్ వ్యాపారం చేస్తే పూటగడవడం గగనంగా మారింది. ఇవాళ టమాట బాక్స్ రూ.1600కు హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు. తరుగు పోను కిలోకి రూ.100కు అమ్మినా నష్టమే వస్తుంది.

కూరగాయలు కొనే పరిస్థితి లేదు

సోమ సుమతి, మహబూబాబాద్



కూరగాయల ధరలు ఆకాశన్నంటుతుండడంతో వాటిని కొనుగోలు చేయలేని పరిస్థితి. ఏ కూరగాయల ధరలను చూసిన కిలో ధర రూ.60కి పైగానే ఉంది. రూ.500 తీసుకుని మార్కెట్ వెళితే కనీసం వారం రోజులకు సరిపడ కూరగాయలు రావడం లేదు. కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో సామన్య, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతోంది. సామాన్యులు కూరగాయలు కొనలేక పచ్చళ్లతో కాలం వెల్లబుచ్చుతున్నారు.

మానుకోట జిల్లాలో 120ఎకరాల్లో కూరగాయల సాగు

రాకేశ్, ఉద్యానశాఖ అధికారి, తొర్రూరు డివిజన్



మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 120 ఎకరాల్లో రబీ సీజన్‌లో రైతులు కూరగాయల పంటలను సాగుచేస్తున్నారు. అయితే గత రెండు నెలలుగా ఉష్ణోగ్రతలు పెరిగి పోవడంతో భూగర్భ జలాలు అడుగంటి విత్తన సమాయన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని మెలకలు దక్కి, కొన్ని ఎండి పోయాయి. దాంతో ఈ ఏడాది ఆశించిన విధంగా కూరగాయల పంటలు దిగుబడి కాలేదు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు కూరగాయలను దిగుమతి చేసుకుంటున్నారు.

తొర్రూరు పీఏసీఎస్ సీఈవో సస్పెన్షన్

తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జూన్ 18 : తొర్రూరు ప్రాథమిక సహకార సంఘం సీఈవో మురళిని విధుల నుంచి తొలగించినట్లు జిల్లా సహకార సంఘం అధికారి వెంకటేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. ఇటీవల తొర్రూరు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాల విక్రయాల్లో అవకతవకలు జరిగిన నేపథ్యంలో వ్యవసాయశాఖ ఏవో కుమార్‌తో పాటు ముగ్గురు ఏఈవోలు సస్పెండ్ అయ్యారు. పీఏసీఎస్ కేంద్రాల్లో జీలుగ విత్తనాల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించడం జరిగిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఈవో మురళిని విధుల నుంచి తొలగించడం జరిగిందన్నారు. తొర్రూరు, పెద్దవంగర పీఏసీఎస్ కేంద్రాల్లో జీలుగ విత్తనాల విక్రయాలపై విచారణ కొనసాగుతుందని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

'విద్యుత్ పోల్' పరీక్షకు ఏర్పాట్లు

- 22న ములుగురోడ్డు ఎన్‌పీటీఐ కేంద్రంలో నిర్వహణ



స్తంభాల చుట్టూ ఏర్పాట్లు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

హనుమకొండ టౌన్, జూన్ 18 : జూనియర్ లైన్‌మెన్ నియామకంలో భాగంగా ఈ నెల 22న నిర్వహించే విద్యుత్ స్తంభం ఎక్కే పరీక్షకు ఎన్పీడీసీఎల్ అన్ని ఏర్పాట్లను చేసింది. 2018 ఫిబ్రవరి 16న టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లకు 2553 జేఎల్‌ఎంలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయగా ఉమ్మడి జిల్లాలో 575 పోస్టుల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాగా, ఈ పోస్టుల కోసం రోస్టర్ పద్ధతిలో ఇప్పటికి వరకు 6 దశల్లో పోల్ పరీక్ష నిర్వహించగా, 22న ములుగు రోడ్డులోని నార్తర్న్ పవర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌పీటీఐ) కేంద్రంలో నిర్వహించే 7వ దశ పరీక్షకు మంగళవారం ఫోర్‌మెన్ ఆధ్వర్యంలో పరిశీలించారు. కాగా, ఈ పరీక్షకు 16 మంది అభ్యర్థులు హాజరవుతుండగా పోల్ పరీక్షను ఆపరేషన్ డైరెక్టర్ మోహన్‌రావు, హనుమకొండ, వరంగల్ జిల్లాల ఎస్ఈలు వెంకటరమణ, మధుసూదనరావుతో పాటు ఎన్‌పీటీఐ డీఈ, ఇతర అధికారుల పర్యవేక్షణలో నిర్వహించి పారదర్శకత కోసం వీడియోగ్రఫీ సైతం తీయడం జరుగుతుందని వెల్లడించారు. కాగా, అభ్యర్థులు దళారులను నమ్మవద్దని, తమ ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో ఉదయం 9 గంటలకు ములుగురోడ్డులోని ఎన్‌పీటీఐ కేంద్రంలో హాజరుకావాలని హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ సూచించారు.

సివిల్ సర్వీస్ పోటీ పరీక్షకు ఉచిత శిక్షణ

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 18 : సివిల్ సర్వీస్-2025 సంవత్సరంలో పరీక్ష రాసే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 040-24071178 నెంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రుద్రేశ్వరుడికి ట్రెయినీ ఐఏఎస్‌ల పూజలు



రుద్రేశ్వరాలయంలో ట్రెయినీ ఐఏఎస్ అధికారులు

హనుమకొండ కల్చరల్, జూన్ 18 : నగరంలోని ప్రసిద్ధ వేయి స్తంభాల రుద్రేశ్వరాలయాన్ని మంగళవారం సాయంత్రం పలువురు ట్రెయినీ ఐఏఎస్ అధికారులు సందర్శించారు. తొలిసారిగా నగరానికి విచ్చేసిన వారు చారిత్రక వేయిస్తంభాల ఆలయ శిల్ప సౌందర్యాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. టూరిజం అధికారి శివాజీ ఆధ్వర్యంలో మనోజ్, అజ్మీర సంకేత్ కుమార్, గరిమ నరుల అభిజ్ఞాన్ మాల్వియ, మహిళా అధికారిణి ఉమా హారతి, అజయ్ యాదవ్‌లు ఆలయాన్ని సందర్శించిన అధికారుల్లో ఉన్నారు. ఇటీవల నిర్మాణం పూర్తయిన వేయిస్తంభాల కల్యాణ మండపాన్ని కూడా తిలకించారు. ఆలయ ప్రాంగణంలో అనేక ఫొటోలు దిగారు. ఆలయంలో ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ వారికి స్వాగతం పలికి రుద్రేశ్వరుడికి వారిచే మారేడుదళ బిల్వార్చణ నిర్వహింపజేసి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

డబుల్.. ట్రబుల్

- బీఆర్ఎస్ హయాంలో ఇళ్ల నిర్మాణం
- పాత వాటి విషయంలో గందరగోళం
- అద్దెకు కొన్ని.. అమ్ముకున్నవి కొన్ని ఉన్నాయనే ఆరోపణలు
- కొత్త వాటికి సంబంధించి పంపిణీ కాని పట్టాలు
- ఆందోళన బాట పడుతున్న లబ్ధిదారులు
- భూపాలపల్లిలో రోజురోజుకు జటిలమవుతున్న సమస్య



వేశాలపల్లి శివారులో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయాలు

భూపాలపల్లిటౌన్, జూన్ 18 : పేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ లక్ష్యమంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. కానీ పేదల సొంతింటి కల నెరవేరడేమేమో గానీ సమస్య తార స్థాయికి చేరింది. ముఖ్యంగా ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూపాలపల్లిలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భూపాలపల్లి జిల్లాలో రెండుదశల్లో 960 ఇళ్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించినా వాటిని సకాలంలో అర్హులకు అందించలేకపోయిందనే విమర్శలున్నాయి. మొదటి దశలో నిర్మించిన 544 ఇళ్లకు గాను లబ్ధిదారులందరికీ పట్టాలు ఇచ్చి ఇంటి నెంబర్లను కూడా కేటాయించారు. ప్రస్తుతం వాటిలో కేవలం 200 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. అందులో కొందరు విక్రయించినట్లు, మరికొందరు అద్దెకు ఇచ్చినట్లు కూడా ఆరోపణలున్నాయి. ఇదిలావుండగా.. రెండవసారి 416 ఇండ్లను నిర్మించగా.. అసెంబ్లీ ఎన్నికల ముందు హడావిడిగా సుమారు 393 మందికి ఇంటి నెంబర్లు అలాట్‌చేశారు కానీ పట్టాలు ఇవ్వలేదు. లబ్ధిదారుల జాబితాను తయారు చేసినా అధికారికంగా ఎలాంటి ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడంతో గందరగోళం నెలకొంది. దీంతో రెండో దశలో ఎంపికైన లబ్ధిదారులు వరుసగా ఆందోళనలు చేస్తుండటంతో సమస్య మరింత తీవ్రమవుతోంది.

ఆందోళనలకు కారణమిదే..

వేశాలపల్లి శివారు భాస్కర్‌గడ్డ సమీపంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 416 ఇళ్లను నిర్మించింది. అయితే వాటిని సకాలంలో కేటాయించకపోగా ఎవరికీ పట్టాలు ఇవ్వలేదు. పైగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావిడిగా ఇంటి నెంబర్లు తూతూ మంత్రంగా కేటాయించారు. 393 మంది లబ్ధిదారును గుర్తించి వారికి అలాట్‌మెంట్ చేసినట్లు అధికార యంత్రాంగం ప్రకటించింది. కానీ ఎటువంటి ప్రొసీడింగ్స్ ఇవ్వలేదు. ఈ క్రమంలో ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం గద్దె దిగడం , కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో లబ్ధిదారులకు ఆందోళన మొదలైంది. తమకు ఇండ్లు దక్కుతాయో లేదోననే బెంగతో ముందస్తుగా ఆందోళనకు పూనుకున్నారు. వీరికి మద్దతుగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి కూడా మద్దతు పలికి ఆందోళనను ఉధృతం చేశారు. మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ అక్కడికి చేరుకుని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వారికి సరైన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా వారు ఆందోళన విరమించలేదు.

రెండు దశలు.. 960 ఇళ్లు...

భూపాలపల్లి పట్టణంలో నివసిస్తున్న పేద ప్రజలకు అర్హులైన వారికి డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు గాను గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు దశల్లో 960 ఇళ్లను నిర్మించింది. అందులో మొదటి దశలో వేశాలపల్లి శివారులో సుమారు 5ఎకరాల భూమిలో 544 ఇండ్లను నిర్మాణం చేసింది. ఈ ఇండ్లు తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి ఉన్నప్పుడు నిర్మించారు. అనంతరం నాటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో రెండోదశలో భాస్కర్‌గడ్డ శివారులో సుమారు నాలుగెకరాల్లో 416 ఇళ్లను నిర్మాణం చేశారు.

544 ఇళ్ల విషయంలో సమస్యలే..

వేశాలపల్లి శివారులో నిర్మించిన 544 ఇళ్ల విషయంలో సమస్య తీవ్రతరమైంది. అందరికీ పట్టాలు ఇచ్చినా అక్కడ కేవలం సుమారు 200 కుటుంబాలు మాత్రమే ఉంటున్నాయి. ఇందులో సుమారు 20 మంది సింగరేణి కార్మికులు ఉన్నారని, 20మంది అద్దెకు ఉంటున్నారని, మరోకొన్నింటిని ఉద్యోగస్తులు కొనుగోలు చేశారని విమర్శలు వస్తున్నాయి. అలాగే ఈ ఇళ్లకు ఉన్న తలుపులు, కిటికీలు, విద్యుత్ సామగ్రిని, పైపులను, ఇతరత్ర సామగ్రిని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకువెళ్లారు. కానీ ఇళ్లు కేటాయించడంతో లబ్ధిదారులే వాటిని సొంత ఖర్చులతో బాగుచేసుకున్నారు. మరికొంత మంది వదిలేశారు. ఒక్కో ఇంటికి సుమారు రూ.50వేల నుంచి రూ.1లక్ష వరకు అయ్యిందని చెబుతున్నారు. ఇంకా కొన్ని ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లేదు. తాగునీటి వసతి లేకపోవడంతో ఇటీవలే అధికారులు బోరు వేసి మోటారు బిగించారు కానీ.. 15కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని, దీంతో నీటి వసతి లేకుండా పోతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. పైగా అన్నింటికి ఒకే ఒక ప్రధాన రోడ్డు ఉందని, ఒకదానికి వేర్వేరుగా వేయాలని కోరుతున్నారు.

కబ్జా బారిన రెండెకరాలు..

544 ఇళ్లు నిర్మించిన ప్రాంతంలో సుమారు ఐదెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. కానీ అందులో రెండు ఎకరాల భూమిని ఆట స్థలానికి, పార్కు కోసం కేటాయించారు. కానీ ఆ రెండు ఎకరాల భూమిని కొందరు వ్యక్తులు తమ అధికారాలను అడ్డంపెట్టుకుని కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు.

గత ప్రభుత్వం గందరగోళాన్ని సృష్టించింది

గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి ఎమ్మెల్యే



గత ప్రభుత్వం పేద ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించింది. సక్రమంగా డబుల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించలేదు. అర్హులకంటే.. అనర్హులు ఎక్కువగా ఉన్నారనే సమాచారం ఉంది. కొన్నింటికి ఇంకా పట్టాలు కూడా ఇవ్వలేదు. అయితే వాటన్నింటిని పరిశీలించి అర్హులైన నిరుపేదలకు ఇంటి పట్టాలు అందించి న్యాయం చేస్తాం. మరో 15 రోజుల్లో ప్రక్రియ ప్రారంభిస్తాం.

ఉద్యోగాలు ఇప్పిస్తామని ముఠా మోసం?

మట్టెవాడ, జూన్ 18: ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి, డబ్బులు వసూలు చేసి, అటు ఉద్యోగం ఇప్పించక, ఇటు డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు మంగళవారం పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. బాధితుల కథనం ప్రకారం వరంగల్ మామునూరుకు చెందిన వ్యక్తితోపాటు హనుమకొండలో నివాసం ఉంటున్న మరో నలుగురు ఒక ముఠాగా ఏర్పడి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించారు. ఒక్కొక్కరి వద్ద నుంచి మూడు నుంచి నాలుగు లక్షల రూపాయలు వసూలు చేశారు. నెలలు గడిచినా ఉద్యోగాలు ఇప్పించకపోవడం, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయినట్టు బాధితులు భావించారు. వరంగల్ జిల్లాతోపాటు నిర్మల్ జిల్లా భైంసా, హనుమకొండ ఇతర జిల్లాల నిరుద్యోగుల నుంచి పెద్ద మొత్తంలో ఈ ముఠా డబ్బులు వసూలు చేసి మోసం చేశారని సమాచారం. మంగళవారం బాధితులు మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 18 : తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే గ్రూపు-2 పరీక్షకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులకు బీసీ స్టసడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 040-24071178 నెంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

'నీట్' అవకతవకలపై నిరసనలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్18 : నీట్ పరీక్షల అవకతవకలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, వీజెఎస్, ఏఐవైఎఫ్ ఐక్య విద్యార్థిసంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం స్టూడెంట్స్ మార్చ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు పి.మధు, చరణ్‌గౌడ్, లోకేష్, బి.మధు, మనోజ్, రాకేష్, దేవేందర్ మాట్లాడారు. నీట్ పరీక్షల్లో ఎక్కువమంది విద్యార్థులకు ఫస్ట్‌ర్యాంకు రావడం చూస్తేనే పేపర్ లీక్ అయినట్లు స్పష్టం అవుతుందన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్లక్ష్యంగా వ్యవహరించింది కాబట్టే లీకేజ్ అయిందని ఆరోపించారు. నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత నుంచి ఎన్‌టీఏను తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు సూర్యప్రకాష్, చంటి, నాగరాజు, జ్యోతిబసు, సింహాద్రి, మహేష్, వెంకటేష్, తరుణ్, సాయి, వీరేందర్ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో స్టూడెంట్స్ మార్చ్ నిర్వహిస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నేతలు

ప్రధాని క్షమాపణ చెప్పాలి..

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన వైద్య అర్హత పరీక్షలో జరిగిన అవకతవకలకు దేశ ప్రధాని నరేంద్రమోదీ నైతిక బాధ్యత వహిస్తూ క్షమాపణ చెప్పాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రాచకొండ ఉదయ్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల రోజునే నీట్ పరీక్ష ఫలితాలు వెల్లడించడం ఒకకుట్ర అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు పకడ్బందీ నియమాలను రూపొందించి నీట్ పరీక్ష నిర్వహణను రాష్ట్రప్రభుత్వాలకు అప్పగించాలన్నారు. గౌతమ్, లక్ష్మణ్, అభిషేక్, గణేష్ పాల్గొన్నారు.

● తొర్రూరు : నీట్ ప్రవేశ పరీక్షలను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు కోరారు. తొర్రూరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెడికల్ ప్రవేశ పరీక్ష (నీట్) తీరుపై కేంద్ర ప్రభుత్వం 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను ప్రమాదంలో పడేసిందని, వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. మార్కుల గందరగోళం, లీకేజీలు జరుగుతుంటే కేంద్రప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పేపర్ లీకేజీలు చేస్తున్న వారిపై తగిన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీహార్, గుజరాత్‌లో పేపర్ లీకేజీలు అవుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఒకే సెంటర్ నుంచి 67 మంది విద్యార్థులు ఫస్ట్ ర్యాంక్ రావడం, మరో సెంటర్‌లో 8మంది విద్యార్థులు ఏకంగా 720 మార్కులు సాధించడం చూస్తే పేపర్ లీకేజీ ఏస్థాయిలో ఉందో అర్థమవుతోందన్నారు. వెంటనే నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బందు మహేందర్, ఆమ్ ఆద్మీ పార్టీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. సురేష్, అరుణ్ కుమార్, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు ఉన్నా.. బస్సు సర్వీసులు సున్నా..

● కేసముద్రం-గూడూరు మండలాల ప్రజల ఇబ్బందులు


కేసముద్రం, గూడూరు డబుల్ బీటీ రోడ్డు

కేసముద్రం, జూన్ 18 : కేసముద్రం నుంచి గూడూరు మండల కేంద్రాల మధ్య డబుల్ బీటీ రోడ్డు ఉన్నప్పటికీ ఆర్‌టీసీ బస్సు సర్వీసులేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేసముద్రం మండల కేంద్రం నుంచి ఉప్పరపల్లి, అర్పనపల్లి, గూడూరు మండలం తీగలవేణి, నాయకపల్లి, బొల్లెపల్లి గ్రామాల మీదుగా గూడూరు మండలకేంద్రం ఉంటుంది. కేసముద్రం నుంచి ఉప్పరపల్లి, అర్పనపల్లి వరకు బస్సు సర్వీసు కొనసాగుతూ అక్కడి నుంచి కాట్రపల్లి, నాగారం మీదుగా నెక్కొండకు నడు స్తోంది. మరోవైపు మహ బూబాబాద్‌నుంచి పెనుగొండ మీదుగా నాయకపల్లి, బొల్లెపల్లి నుంచి గూడూరు వరకు ఒక బస్సు సర్వీసు ఉండేది. రెండేళ్ల క్రితమే ఈ సర్వీసును రద్దు చేశారు. కొద్ది నెలల క్రితం గూడూరు నుంచి కేసముద్రం మీదుగా తొర్రూరుకు ఒక బస్సు సర్వీసును నడిపించారు. ఈ బస్సు చాలా గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేది. ఈ సర్వీసును సైతం ఆర్‌టీ సీ అధికారులు రద్దు చేశారు. దీంతో తీగలవేణి, నాయకపల్లి, బొల్లెపల్లి గ్రామాల ప్రజలకు బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సు మాత్రం అందుబాటులో లేదు. కేసముద్రం-గూడూరు మధ్యన చక్కని డబుల్ బీటీ రోడ్డు ఉన్నప్పటికీ ప్రయాణం చేయాలంటే వాహనాలు అందుబాటులో లేక గంటల తరబడి ప్రజలు వేచి ఉండాల్సివస్తోంది. ఈ విషయంపై ఆయా గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధుల దృష్టికి పలుమార్లు తీసుకువచ్చినప్పటికీ ఎలాంటి స్పందన లేదని ఆరోపిస్తు న్నారు. తమ గ్రామానికి బస్సు సర్వీసును ప్రారంభించాలని పట్టుబట్టి చొరవ తీసుకునే ప్రజాప్రతినిధే కరువ య్యారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. బస్సు సర్వీసులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వాహ నాలను ఆశ్రయించాల్సివస్తోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మహబూబాబాద్ నుంచి గూడూరు మీదుగా నర్సంపేట, వరంగల్ నడిచే కొన్ని సర్వీసులను వయా కేసముద్రం, గూడూరు నడిపించాలని కోరుతున్నారు. గూడూరు నుంచి కేసముద్రం మీదుగా తొర్రూరు సర్వీసు పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నేడు సందల్, కందిల్

మహబూబాబాద్ రూరల్, జూన్ 18 : మానుకోట మునిసిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి హజరత్ సయ్యద్ ఇమాంషావళి దర్గా పీఠాధిపతి షేక్ అన్వర్‌పాషా తాజి నిజామి ఇంటి వద్ద నుంచి మానుకోట తహసీల్దార్ ఆఫీస్‌కు మంగళవారం రాత్రి 9గంటలకు తహసీల్ కార్యాలయానికి చేరుకుని అధికారి చేతుల మీదుగా గంధం తీసుకుని ఊరేగింపుగా తిరిగి ఈదులపూసపల్లి దర్గాకు బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు చేరుకోనున్నట్లు దర్గా పీఠాధిపతి షేక్ అన్వర్‌పాషా తెలిపారు. అదే రోజు ముస్లింలు పెద్ద ఎత్తున దర్గాకు తరలివచ్చి ప్రార్థనలు చేసి చాదర్ సమర్పిస్తారని తెలిపారు. మతాలకతీతంగా ప్రజలంతా హాజరవుతారని చెప్పారు.

భక్తులకు అన్నదానం

గార్ల, జూన్ 18 : ఆధ్యాత్మిక గురువు రామదూత స్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని గార్లలోని నెహ్రూసెంటర్‌లో జితేంద్రకుమార్ అగర్వాల్ నేతృత్వంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో కోట ఉత్తరయ్య, భాస్కర్‌రావు, పరుచూరి కుటుంబరావు, సోమయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో 'భౌ' భయం

(5వ పేజీ తరువాయి)

ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారి, తొర్రూరు-మహబూబాబాద్ రహదారి వెంట వదిలి వేయడంతో పట్టణ శివారుల్లో ఉన్న ఫంక్షన్‌హాళ్ల వద్ద నివసిస్తూ గ్రామాల్లో సంచరిస్తున్నారు. దీంతో రహదారివెంట వెళ్లే ప్రయాణీకులు, గ్రామాల్లో ప్రజలు, చిన్నారులపై దాడులు చేయడంతో ఇప్పటి వరకు తొర్రూరు సీహెచ్‌సీ పరిధిలోనే మే నెల మొదటి నుంచి, జూన్ 18 వరకు 217మంది కుక్కకాటుకు గురైనట్లు వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు.

గ్రామాల్లోని కుక్కలను తరలించాలి..

వెల్పుల ఐలయ్య మడిపల్లి గ్రామం, తొర్రూరు మండలం



గ్రామాల్లో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం కుక్కలను చంపకూడదని వాటి సంతానోత్పత్తిని తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. గ్రామాల్లో సంచరిస్తున్న కుక్కలను తరలించాల్సిన అధికారులు ఒక్క రోజుకూడా గ్రామానికి రాలేదు. పైగా ఎక్కడో పట్టుకొచ్చిన కుక్కలను గ్రామశివారుల్లో వదిలివేయడంతో రోజురోజుకు కుక్కల సంఖ్య పెరిగిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లోని కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలి.

'తాగునీరు కలుషితమవడంపై స్పందించాలి'

గార్ల, జూన్ 18 : మండల కేంద్రంలో వారంరోజులుగా మిషన్ భగీరథ పైపులైన్ దెబ్బతిని కలుషిత నీరు సరఫరా అవుతునప్పటికి అధికారులు పట్టించుకోవడంలేదని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంపాల విశ్వ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి మురుగునీరు రాకుండా చూడాలన్నారు.

'రేషన్‌షాపును ఏర్పాటు చేయాలి'

కేసముద్రం, జూన్ 18 : అమినాపురంలో రేషన్‌షాపును ఏర్పాటు చేయాలని కోరుతూ అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు వల్లందాసు రవి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎంఆర్ఐ చెరుకు బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధికార ప్రతినిధి సోమారపు శ్రీరాములు మాట్లాడారు. అమినాపురం ప్రజలు రేషన్‌బియ్యం కోసం రైల్వే ట్రాక్ దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వెంటనే అమినాపురంలో రేషన్‌షాపును ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మందుల కృష్ణమూర్తి, మిట్టగడుపుల యాకయ్య పాల్గొన్నారు.

గంగారం మండలానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

● ప్రజా పంథా జిల్లా సహాయ కార్యదర్శి రవి

మహబూబాబాద్ రూరల్, జూన్ 18 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి మారు మూల ఏజెన్సీ మండలం గంగారానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవి మట్లాడుతూ.. మారుమూల ప్రాంతమైన గంగరాం మండలకేంద్రం నుంచి జిల్లా కేంద్రం మానుకోటకు వివిధ పనుల నిమిత్తం వచ్చేందుకు బస్సు సౌకర్యం లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడ నుంచి మానుకోటకు నడుస్తున్న ఆర్టీసీ బస్సును గంగారం వరకు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పైండ్ల యాకయ్య, రంగయ్య, రాచకొండ ఉదయ్, గౌతమ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న బీజేపీ మహిళా మోర్చా నేతలు

ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి : బీజేపీ

మహబూబాబాద్ టౌన్, జూన్ 18 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆశ వర్కర్లకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గుండెబోయిన నాగమణి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ ఆశవర్కర్లకు తలపెట్టిన పరీక్షను వెంటనే నిలిపి వేసి వారికి ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. నెలకు రూ. 18 వేలు కనీస వేతనం ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన విధంగా సంవత్సరానికి 22 సాధారణ సెలవులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చంద్రకళ, అజ్మీర సుమలత, విజయ, మంగమ్మ, కుమారి, స్వరూప పాల్గొన్నారు.

నేటి జాబ్‌మేళాకు ఉచిత రవాణా

కొత్తగూడ, జూన్ 18 : ములుగు మండలం ఇంచెర్ల గ్రామంలో బుధవారం (నేడు) నిర్వహిస్తున్న మేగా జాబ్‌మేళాకు వెలుతున్న నిరుద్యోగులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సై దిలీప్ వాహనాలను ఏర్పాటు చేసి ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై దిలీప్ మాట్లాడుతూ జాబ్‌మేళాకు వెళ్లే నిరుద్యోగులు 8712656965 నెంబర్‌కు ఫోన్ చేసి పోలీస్ స్టేషన్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఉదయం 6గంటలకు వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. కొత్తగూడ నుంచి ములుగు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన


కంబాలపల్లి పీహెచ్‌సీలో బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మౌనిక

మహబూబాబాద్ రూరల్, జూన్ 18 : కంబాలపల్లి పీహెచ్‌సీలో సిబ్బందికి బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించినట్లు డాక్టర్ మౌనిక మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికి సర్వే చేస్తూ ఇంట్లో ఉన్న 18 సంవత్సరాల పైబడిన వారు, టీబీ మందులు వాడుతున్న వారు తప్పనిసరిగా వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. ఈనెల 19 నుంచి ఇంటింటా సర్వేను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బందిసక్రి, పుష్పలీల, దండె శ్రీహరి, ఇందిరా, సుభద్ర, గోవిందమ్మ పాల్గొన్నారు.

'హత్య చేసిన వారిని శిక్షించాలి'

మహబూబాబాద్ టౌన్, జూన్ 18 : హైదరాబాద్ మియాపూర్ వద్ద గిరిజన బాలికను హత్య చేసిన నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని గోర్‌సేనా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బోడ హరిలాల్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు మంగళవారం గోర్‌సేనా ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా హరిలాల్ మాట్లాడుతూ బాలిక హత్య కేసును వేగవంతం చేసి ప్రత్యేక కమిషన్ వేసి సిట్టింగ్ జడ్జీచే న్యాయవిచారణ జరిపించాలన్నారు. లేనిపక్షంలో అసెంబ్లీ ముట్టడికి వెనుకాడ బోమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ సురేష్‌నాయక్, మోతీలాల్, లావుడ్య హరిలాల్, సురేష్, మాలోతు కిరణ్‌కుమార్, అజ్మీర నవీన్ పాల్గొన్నారు.

ఝాన్సీలక్ష్మీబాయి వర్ధంతి


ఝాన్సీలక్ష్మీబాయి ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న నేతాజీ సేవా సమితి సభ్యులు

మహబూబాబాద్ టౌన్, జూన్ 18 : పట్టణంలో నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం వీరనారిమణి ఝాన్సీలక్ష్మీబాయి వర్ధంతిని నిర్వహించారు. ఆమె ఫ్లెక్సీ వద్ద నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు కె.గిరిజ, ఈ.శ్రీవాణి, కె.వసంత, జి.సునితను సన్మానించారు. ఈ సందర్భంగా నేతాజీసేవాసమితి అధ్యక్షుడు డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ వీరనారిమణి ఝాన్సీలక్ష్మీబాయి స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలని చెప్పారు. కుదురుపాక వివేక్, డాక్టర్ రవీందర్, శంకర్, ఆకారపువిశ్వనాథం, మైస రోహిత్, రవి, సామ శ్రీనివాస్, ప్రజ్వాల్, సత్యనారాయణ, కేశవరావు, కుంట రజిత పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

పెద్దవంగర, జూన్ 18: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి సత్వరమే పూర్తి చేయాలని ఎంపీడీవో వేణుమాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 20గ్రామాల పరిధిలో ఎస్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేపట్టిన రికార్డులను పరిశీలించి జీపీలో అందుబాటు ఉంచాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వేణుమాదవ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఉన్న మిషన్ భగిరథ కుళాయి (నల్లా) కనెక్షన్ సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఎంపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళా గ్రూపు సభ్యులకు ప్రభుత్వం చేయూత

● పాఠశాల విద్యార్థులకు యూనిఫాం కుట్టడం ద్వారా ఉపాధి

డోర్నకల్, జూన్ 18 : స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం పలు రకాలుగా చేయూతనందిస్తోంది. అందులో భాగంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించి వారికి గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. దీంతో వడ్ల కొనుగోలు ద్వారా సదరు కొనుగోలు నిర్వాహకులకు కమీషన్ రూపంలో స్వయం సహాయక సంఘాలకు నిధులు జమ అయ్యాయి. అలాగే డోర్నకల్ మండలంలో గతేడాది పైలెట్ ప్రాజెక్టుగా మహిళ సంఘాల ద్వారా మిర్చి కొనుగోళ్లు సైతం చేపట్టారు. ఇలా కొనుగోలు చేసిన మిర్చిని సీరోలు మండలంలోని మిర్చి నుంచి ఆయిల్ తీసే మిల్లుకు మిర్చి విక్రయించారు. దీంతో మిర్చి కొనుగోళ్లతో కూడా మహిళ సంఘాలకు కమిషన్ భారీగానే వచ్చింది. అలాగే రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్‌ప్రభుత్వం మహిళ సంఘాలకు సున్నావడ్డీ పథకాన్ని ప్రవేశపెట్టింది. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫాంను మహిళ సంఘాల చేత కుట్టించడం ద్వారా వారికి ఉపాధిని కల్పించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా డోర్నకల్ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న సుమారు 2,639 మంది విద్యార్థులను గుర్తించారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల స్కూల్ యూనిఫాంలను అందించడానికి మహిళ సంఘాలకు సెర్ప్ సహకారంతో విద్యాశాఖ అధికారులు కావాల్సిన క్లాత్‌ను సమకూర్చారు. 7వ తరగతిలోపు చదువుతున్న విద్యార్థినులకు స్కర్ట్, చొక్కా, 7 నుంచి 10లోపు విద్యార్థినులకు పంజాబి డ్రెస్‌లు, 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్యాంట్, షర్ట్‌లను అందించనున్నట్లు అధికారులు నిర్ణయించారు.


గొల్లచర్లలో గ్రూపు సభ్యుల మహిళలు కుడుతున్న స్కూల్ యూనిఫాంను పరిశీలిస్తున్న సెర్ప్‌సిబ్బంది

స్కూల్ యూనిఫాంను కుట్టే మహిళలకు ఒక్కో జతకు రూ.50 ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు తగ్గట్లుగా విద్యార్థుల శరీర కొలతలు తీసుకుని అందుకనుగుణంగా యూనిఫాంలను కుట్టి వారికి అందజేసినట్లు సెర్ప్ అధికారులు తెలిపారు. మొదటి విడతగా ఒక జత యూనిఫాంలను విద్యార్థులకు అందించినట్లు సెర్ప్ ఏపీఎం శంకర్‌నాయక్ తెలిపారు.

కుట్టు కూలీ పెంచాలి..

విద్యార్థుల యూనిఫాంలను కుట్టే ఖర్చు ఎక్కువ అవుతుందని, ప్రభుత్వం అందించే కూలీ తక్కువగా ఉందని మహిళ సంఘాల సభ్యులు వాపోతున్నారు. ప్రభుత్వం యూనిఫాంను కుటేందుకు అవసరమైన క్లాత్ మాత్రమే అందిస్తున్నారు. కుట్టడానికి ఉపయోగించే దారం, బటన్‌లు, తామే కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని, దీంతో తమపై ఆర్థికంగా భారం పడుతోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. యూనిఫాం కుట్టేందుకు కనీసం ఒక జతకు రూ.100 పెంచాలని కోరుతున్నారు.


సీడీపీవోకు వినతి పత్రాన్ని అందిస్తున్న ఏఐటీయూసీ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

● ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూన్ 18 : అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లారీశ్వరీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సీడీపీవో రాజ్యలక్ష్మికి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు, హెల్పర్లకు రూ.21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే భవనాలను నిర్మించాలని కోరారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష వెంటనే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బానోత్ లలిత, కీసర సౌమ్యశ్రీ, పెరుగు వరలక్ష్మి, రజియా, శివకుమారి, పద్మ, స్వప్న, భానుమతి, పెరుగుకుమార్, చింతకుంట్ల వెంకన్న పాల్గొన్నారు.

ఆర్‌ఓఎఫ్‌ఆర్, పెసా చట్టాలను అమలు చేయాలి

● తుడుందెబ్బ, ఏఎస్పీ నాయకులు

కొత్తగూడ, జూన్ 18 : భారత రాజ్యాంగాన్ని అనుసరించి ఉన్న అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ఆర్‌ఓఎఫ్‌ఆర్), పేసా చట్టాలను అమలు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కొత్తగూడలో మంగళవారం తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పూనెం సందీప్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఉన్న ఆదివాసీలకు భూమిపై హక్కు కల్పించాలని, రైతుబంధు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూములు సాగుచేసుకుంటున్న ఆదివాసీలను అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. సమావేశంలో ఏఎస్పీ జిల్లా అధ్యక్షుడు సిద్ధబోయిన భాస్కర్, మోకాళ్ల సుధీర్, ఈసం వెంకన్న, సంజీవ్, రాజు, బుజంగరావు పాల్గొన్నారు.

ముళ్ల పొదలతో మాసుకుపోయిన చెరువు కట్ట


పెద్దవంగర చెరువు కట్టకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు

పెద్దవంగర, జూన్ 18: మండల కేంద్రంలోని చెరువు కట్ట ముళ్ల పొదలతో మాసుకుపోయింది. దీంతో అటు వైపు వ్యవసాయ బావుల వద్దకు వేళ్లే రైతులకు చెరువు కట్టపై కనీసం కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తూములు, కాలువల నిర్మాణం, పూడికిత పనులతో పాటు కట్టను ముళ్లపొదలను తొలగించారు. మళ్లీ పొదలు చెరువు కట్టపై ఏపుగా పెరిగి దారి మాసుకుపోవడంతో కట్టపై నుంచి వెళ్లలేక పోతున్నామని రైతులు, వాహనాదారులు వాపోతున్నారు. చెరువు కట్టపై ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని పలు మార్లు అధికారులకు తెలిపినా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువు కట్టపై ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

'ఏఐకేఎంఎస్ జిల్లా జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి'


కొత్తగూడలో మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

కొత్తగూడ, జూన్ 18 : మహబూబాబాద్‌లో ఈనెల 26న నిర్వహిస్తున్న ఏఐకేఎంఎస్ జిల్లా జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు భూక్య బుచ్చిరాములు, కార్యదర్శి యాదగిరి యుగేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడలో వారు మాట్లాడారు. మండల సహాయ కార్యదర్శి గజ్జి సోమన్న, గంగారం మండల అధ్యక్షుడు సువర్ణపాక నర్సయ్య, నాయకులు దేవుళ్లపల్లి మంగన్న, గట్టి సురేందర్, బంగారి యాకబాబు పాల్గొన్నారు.